వామ్మో.. ఎలుగుబంటి

కళ్యాణదుర్గం ప్రజలకు ఎలుగు గుబులు

- జనావాసాల్లో సంచరిస్తున్న ఎలుగుబంట్లు
- జనంపై దాడికి తెగబడుతున్న వైనం
- సమాచారం అందిస్తున్నా పట్టించుకోని అటవీశాఖ సిబ్బంది



కళ్యాణదుర్గం పట్టణంలోని విద్యా నగర్‌లో సంచరిస్తున్న ఎలుగుబంటి (ఫైల్)

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ప్రజలకు ఎలుగు... గుబులు పట్టుకుంది. సాయంత్రం అయ్యిందంటే చాలు.. శివారు కాలనీల్లో ప్రజలు భయాందోళనతో గడిపే పరిస్థితి. అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులకు సరైన వసతులు లేక ఆహారం కోసం జనావాసాల్లోకి చొరబడుతున్నాయి. ఆకలితో ప్రజలపై విచక్షణా రహితంగా దాడులకు తెగబడుతున్నాయి. దీనికి తోడు వేకువజామునే పొలాలకు వెళ్లాలంటేనే రైతులు, కూలీలు జంకుతున్నారు. అటవీ ప్రాంతం నుంచి వన్యప్రాణులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు చేపట్టాల్సిన అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కళ్యాణదుర్గం అటవీ రేంజ్ పరిధిలో సుమారు 120కి పైగా ఎలుగుబంట్లు ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు చెప్తున్నారు. అయితే అటవీ ప్రాంతంలో పచ్చిక , సరైన ఆహారం లభించకపోవడంతో గ్రామాల మధ్యలోకి వస్తున్నట్లు అధి కారులు చెప్తున్నారు. అయితే వీటి సంరక్షణ పట్టించుకోకపోవడం వల్లే జనాసావాల్లోకి వస్తున్నట్లు ప్రజలు అంటున్నారు. దొడగట్టలో గురువారం అర్ధరాత్రి ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న నల్లబోతుల శ్రీనివాసులు, గొల్ల కర్రెన్నలపై ఎలుగుబంట్లు విచక్షణా రహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు గాయపడిన వారిని హుటాహుటిన కళ్యాణదుర్గం ఆస్పత్రికి, అక్కడి నుంచి అనంతపురానికి తరలించారు. ఇలా ఈ ఘటనలేకాక నియోజకవర్గ వ్యాప్తంగా ఏదో ఒక గ్రామంలో ఎలుగు బంట్లు విచక్షణారహితంగా దాడులు చేస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

దుర్గంలో మూడు నెలల్లో జరిగిన ఘటనలు..

- గతేడాది కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లి గ్రామానికి చెందిన కుళ్లాయప్ప పొలం పనులకు వెళ్తుండగా ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఆయనపై విచక్షణా రహితంగా దాడి చేయడంతో అనంతపురం ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు.
- అదే ఏడాది కంబదూరు మండలంలోని ప్రసిద్ధి గాంచిన శ్రీ కమల మల్లేశ్వర స్వామి ఆలయంలో ఎలుగుబంటి చొరబడింది. రాత్రి సమయాల్లో ఆలయంలోకి ప్రవేశించి, హడావుడి చేసింది. ఈ దృశ్యాలు అప్పట్లో ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. అప్పటి నుంచి పూజారులు వేకువజామున ఆలయం వద్దకు వెళ్లేందుకు భయపడుతున్నారు.
- గతేడాది ఆగస్టు నెలలో కళ్యాణదుర్గం పట్టణంలోని దొడగట్ట రోడ్డులో ఉన్న ఓ బిస్కెట్ల గోదాములోకి ఎలుగుబంటి వరుసగా మూడు రోజుల పాటు చొరబడింది. గోదాములోని నిల్వ చేసిన బిస్కెట్లను తిని, అక్కడి నుంచి వెళ్లిపోయింది.
- ఇదే తరహాలోనే ముదిగల్లు గ్రామానికి చెందిన ఓ రైతు పొలం పనులకు వేకువజామునే వెళ్తుండగా చెట్ల పొదల్లో నుంచి ఒక్కసారిగా ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచింది. ఇటీవల కళ్యాణదుర్గంలోని దేవీరమ్మ కాలనీ, విద్యా నగర్, ఆర్డీటీ ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో నిత్యం ఎలుగుబంట్లు సంచరిస్తూ స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి.
- గురువారం అర్ధరాత్రి కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్టలో ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న నల్లబోతుల శ్రీనివాసులు, గొల్ల కర్రెన్నలపై ఎలుగుబంట్లు విచక్షణా రహితంగా దాడి చేసింది. తలపై భారీగా దాడి చేయడంతో తల మొత్తం కుట్లు పడ్డాయి. కుటుంబ సభ్యులు వెంటనే తేరుకోవడంతో గట్టిగా కేకలు వేయగా అక్కడి నుంచి పక్కనే ఉన్న గుట్టలోకి పరుగులు పెట్టాయి. గాయపడిన వారిని హుటాహుటిన కళ్యాణదుర్గం నుంచి అనంతపురానికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.

గస్తీ కాయడంలో అధికారుల విఫలం..

ఎలుగుబంట్ల దాడుల నుంచి పంటలు, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన అటవీ శాఖ అధికారులు.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలుగుబంట్ల సంచారంపై ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఎలుగుబంట్ల సంచరించే ప్రాంతంలో గస్తీ కాయడంలో అటవీ శాఖ అధికారులు విఫలయ్యారనే ప్రజలు మండిపడుతున్నారు.

దాడులు చేస్తున్నా పట్టించుకోరు

ఎలుగుబంట్లు రోజూ మా కాలనీలోకి వస్తున్నాయి. పక్కనే గుట్ట ఉండటంతో చిరుత పులులు, ఎలుగుబంట్ల దాడులు ఎక్కువయ్యాయి. అటవీశాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా గస్తీకి రారు. మొక్కుబడిగా పగలు పూట వచ్చి విచారణ చేసి వెళ్లిపోతున్నారు. ప్రజలకు రక్షణగా ఏమైనా చర్యలు చేపట్టాలి.
– సూరి యాదవ్, దొడగట్ట గొల్లలదొడ్డి

గస్తీ ముమ్మరం చేస్తాం

అడవి జంతువుల బారి నుంచి ప్రజలను రక్షించేందుకు గస్తీ ముమ్మరం చేస్తాం. అటవీ ప్రాంతం నుంచి ఇటీవల చిరుతలు, ఎలుగుబంట్లు జనావాసాల్లోకి వస్తున్నాయి. వీటి కదలికలపై సిబ్బందితో ప్రత్యేక నిఘా ఉంచాం. ప్రజలు ఫిర్యాదు చేస్తే వెంటనే ఆయా పరిసర ప్రాంతాలను పరిశీలించి సంరక్షణ చర్యలు చేపడుతాం.
– మధుబాబు, ఇన్‌చార్జ్ ఫారెస్ట్ రేంజర్, కళ్యాణదుర్గం

క్లుప్తంగా

గవిమఠం పీఠాధిపతికి విశ్వ పరామర్శ



పీఠాధిపతిని పరామర్శిస్తున్న విశ్వేశ్వర రెడ్డి

ఉరవకొండ: గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామిని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ముందుగా గవిమఠంలో గవిసిద్ధేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన గవిమఠం సహాయ కమిషనర్ రాణితో కలిసి పీఠాధిపతులను కలిశారు. పీఠాధిపతుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఠాధిపతుల నుంచి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బసవరాజు, పార్టీ మండల కన్వీనర్ మూలగిరిపల్లి ఓబన్న, సోమశేఖర్, చిన్న భీమ, మహనంది, వేమన్న తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు

గుమ్మఘట్ట: ఈ నెల 5 నుంచి 8వతేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలను కొనసాగిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 15 వతేదీ వరకు 75 వీరాపురం, గుమ్మఘట్ట గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వాహనాల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న ఏఈఎస్ రేవతి

బ్రహ్మసముద్రం: పలు మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను పోలీస్ అధికారులు వేలం నిర్వహించారు. శుక్రవారం ఏఈఎస్ రేవతి, రూరల్ సీఐ నీలకంఠేశ్వర్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. బ్రహ్మసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో 13 వాహనాలు వేలం వేయగా మొత్తం రూ. 3,02,570 ఆదాయం వచ్చింది. శెట్టూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని 5 వాహనాలను రూ. 92,630 ఆదాయం సమకూరిందని ఎస్‌ఐ నరేంద్రకుమార్ తెలిపారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

శెట్టూరు : ములకలేడు, అనుంపల్లి వద్ద ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. అనుంపల్లికి చెందిన తండ్రీ కొడుకులు పాలయ్య, సందేష్ ములకలేడు వైపు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన రవితేజ ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో ముగ్గురికీ గాయాలయ్యాయి. స్థానికులు వారిని కళ్యాణదుర్గం ఆసుపత్రికి, అక్కడి నుంచి అనంతపురం తరలించారు.

పేద కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ (వజ్రకరూరు): వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతండాకు చెందిన పి.వెంకటేష్ నాయక్ కుటుంబానికి స్థానిక ఉద్యోగులు అండగా నిలిచారు. ఇటీవల వెంకటేష్‌నాయక్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. వెంకటేష్‌నాయక్ భార్య సోమిబాయి కూడా ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో వెంకటేష్‌నాయక్ సోమిబాయి దంపతుల కూతుర్లు నిర్మలబాయి, యశోదబాయి దిక్కులేనివారయ్యారు. నిర్మలబాయి దివ్యాంగురాలు కావడంతో ఇంటివద్దనే ఉంటోంది. యశోదబాయి తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదువుతోంది. వారి ఆర్థిక స్థితిగతులపై గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త నాగరాజునాయక్ గిరిజన ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఉద్యోగులు స్పందించి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.

వైద్య సేవలందక అవస్థలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సాహితీ

కూడేరు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలు అందక రోగులు అవస్థలు పడుతున్నారు. వైద్యాధికారిణి సౌమ్యారెడ్డి గత నెల29,30 తేదీల్లో సెలవుపై వెళ్లారు. కానీ గురు, శుక్రవారం కూడా విధులకు హాజరుకాలేదు. మార్చి 2న వైద్యుడు లక్ష్మీనారాయణ ఉన్నత విద్యనభ్యసించడానికి వెళ్లారు. శుక్రవారం పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే 104 వాహనం ద్వారా కూడేరు సచివాలయం-2లో కూడా వైద్యసేవలు అందించారు. డాక్టర్ సాహితీ కొంతసేపు సచివాయంలోనూ మరికొంత సేవ ప్రభుత్వాస్పత్రిలో సేవలు అందించేందుకు వెళ్లాల్సి వచ్చింది. దీంతో పూర్తిస్థాయిలో వైద్యసేలు అందక గర్భిణులు, రోగులు ఇబ్బందులు పడ్డారు.

వరి కుప్పలకు నిప్పు

రాయదుర్గంటౌన్: చదంలో రైతు పెద్ద గౌని ఈరన్నకు చెందిన 1.50 ఎకరాల్లో సాగు చేసిన వరి కుప్పలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు.దీంతో సుమారు రూ.1.50 లక్ష నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



జిల్లా అధ్యక్షుడు అనంతను కలిసిన అనుబంధ విభాగాల నేతలు

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి ఆది సద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి హళ్లి నాగరాజు, వైఎస్సార్‌సీపీ వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పుల్లంపల్లి పెద్దిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా ఉపాధ్యక్షులు దేశాయి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కెంగుట రామిరెడ్డిలు జిల్లా అధ్యక్షుడు అనంతను కలిశారు. మండలంలో పార్టీ పరిస్థితిపై నేతలతో అనంత ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. సమస్యలుంటే సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డితోపాటు తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం నేతలు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డిని కలిసి బుకే ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి రాయదుర్గం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఆర్కే బద్రీ, నాయకులు ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, తుకారాం, జయరామిరెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడికతీతకు శ్రీకారం



పూజలు చేసి పూడికతీతను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, అధికారులు

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘంలోని సిద్దేశ్వర కాలనీ బైలాంజనేయస్వామి ఆలయం వద్ద డ్రైనేజీ వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ రవి ప్రకాష్‌నాయుడు పూడికతీత పనులు శుక్రవారం ప్రారంభించారు. కమిషనర్ దివాకర్‌రెడ్డి, చైర్‌పర్సన్ మాట్లాడుతూ రూ.22 లక్షలతో ప్రధాన డ్రైనేజీలతోపాటు మీడియం, పిల్ల కాలువల్లో పూడికతీత పనులను చేయనున్నట్లు తెలిపారు. 25లోపు పూడికతీత పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఏఈలు నరసింహులు, ప్రతాప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, 1వ వార్డు ఇన్‌చార్జ్ భీమనపల్లి దివాకర్, కోఆప్షన్ సభ్యుడు నజీర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బ్రహ్మసముద్రం : ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సేవ్ ఆర్డీటీ.. సేవ్ అనంతపురం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. మండల కేంద్రంలోని నంజాపురం రోడ్డులోని ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. తహసీల్దార్ సుమతికి వినతిపత్రం అందించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరప్ప, ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్, సర్పంచులు రామ్మోహన్ , తలారి గోవిందప్ప, ఎంపీటీసీలు బుసప, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, మంజునాథ, నియోజకవర్గ కార్మి క సంఘం అధ్యక్షుడు తలారి సంజీవయ్య, జిల్లా ఆర్టీఐ విభాగం కార్యదర్శి సునీల్, క్రిస్టియన్ విభాగం అధ్యక్షులు దేవపుత్ర, నాయకులు కొండాపురం రా ము, పోలేపల్లి లోకేష్, తిమ్మారెడ్డి, ఎరడికెర ఎల్లప్ప, మద్దిలేటిరాజు, శరణప్ప, నటరాజ్ శివన్న, పేసేప్ , కోడిపల్లి మంజు, జానీ, మంజు, ప్రసాద్, ఇస్మాయిల్, నాగరాజు, శంకర్‌నాయక్, సోము, ప్రశాంత్ తిప్పేస్వామి, హనుమంత, ఉమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శంకరాచార్యుల జయంతి



ఆది శంకరాచార్యుల మూలవిరాట్



ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన శారదా శంకరమఠంలో శుక్రవారం జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రధాన అర్చకులు ప్రసన్నశాస్త్రి ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం స్వామికి మహన్యాస పారాయణ, ఏకాదశ రుద్రా భిషేకం, గణపతి పూజ, అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవమూర్తి శోభయాత్ర నిర్వహించారు.

రామానుజాచార్యుల జయంతి :

స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో వైష్ణవ సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం రామానుచార్యుల 1008 జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రామానుజాచార్యుల చిత్రపటానికి పూజలు చేశారు. వైష్ణవ సమాజ సభ్యులు, భక్తులు విశేషంగా హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వైష్ణవ సమాజం అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి రాజేష్, కోశాధికారి కృష్ణమూర్తి, సభ్యులు సుబ్రమణ్యశర్మ, సింహాద్రి, ఆనంద్, సంతోష్, యాదవ సంఘం అధ్యక్షుడు ఉమాశంకర్, కార్యదర్శి బాబు, తిమ్మరాజులు, నాగరాజు, జర్నలిస్ట్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాసామ్రాజ్య పట్టాభిషేకం



మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వ రరెడ్డి

ఉరవకొండ (వజ్రకరూరు): వజ్రకరూరు మండలం గంజికుంటలో శుక్రవారం భక్తుల కొంగుబంగారం నీలగిరిస్వామి- అయ్యాళప్పస్వామివార్ల మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం నీలగిరిస్వామి- అయ్యాళప్ప స్వామికి గంగపూజ నిర్వహించారు. అనంతరం నీలగిరిస్వామి పూజ, నల్లకంబడిపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం పటముపూజ జరిగింది. సాయంత్రం కామక్కకథ చెప్పించారు. మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవానికి వివిధ గ్రామాల గుడికట్ల భీరప్పస్వాములు తరలివచ్చారు. జిల్లా నలుమూల నుంచి కూడా వేలాదిగా తరలివచ్చారు. మత కుల గురువు రేవణ సిద్దేశ్వర, నూతన పూజార్లు అభిరామ్, అరుణ్ సాయి,బన్నెల బ్రదర్స్ పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకునన విశ్వేశ్వరరెడ్డి: గంజికుంటలో శుక్రవారం నిర్వహించిన నీలగిరిస్వామి- అయ్యాళప్పస్వామివార్ల మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు.

ఘనంగా కల్యాణ మంటపం ప్రారంభం






ఊరేగింపులో నీలకంఠ పట్టాదార్య మహాస్వాములు, కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కళ్యాణదుర్గం: పట్టణంలో వెలసిన నీలకంఠేశ్వర దేవస్థానంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మంటపం ప్రారంభోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం కూర్మి సమాజం శ్రీ శ్రీశైల మూలపీఠ సూర్య సింహాసన 1008 నీలకంఠ ఫట్టాదార్య మహాస్వాములు (గదగ- బెలగేరి) ఆశీస్సులతో ప్రారంభోత్సవం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కూర్మి కులస్తులు కలశాలతో కల్యాణమండపం వరకు ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేక మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో నీలకంఠ పట్టాదార్య మహా స్వాములను ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. అనంతరం నీలకంఠేశ్వర ఆలయంలో స్వాములు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అమ్మాయిలు మానసికంగా దృఢంగా ఉండాలి



మాట్లాడుతున్న కళ్యాణదుర్గం సీడీపీఓ లక్ష్మీప్రసన్న

కళ్యాణదుర్గం రూరల్: అమ్మాయిలు మానసికంగా దృఢంగా ఉండాలని సీడీపీఓ లక్ష్మీప్రసన్న, మున్సిపల్ కమిషనర్ వంశీ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కుమ్మరి వీధిలోని 9వ సచివాలయం పరిధిలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బందికి బాలికలకు సమావేశం నిర్వహించారు. సీడీపీఓ, కమిషనర్ మట్లాడుతూ జూన్ 10 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా ప్రవేశపెట్టిన కిశోరి వికాసం కార్యక్రమంతో విజ్ఞానం, వినోదం తోపాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ తెలిపారు. శుక్రవారం నుంచి అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. స్థానిక 18,19 వార్డు సచివాలయం పరిధిలోని ఇందిరాబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త విజేత పాల్గొన్నారు.

కిశోర బాలికల వికాసం కోసమే శిక్షణ

కణేకల్లు: కిశోర బాలికల వికాసం కోసమే వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని 18 గ్రామ సచివాలయాల్లో శుక్రవారం వేసవి శిక్షణ తరగుతులు ప్రారంభమయ్యాయి. సొల్లాపురం గ్రామ సచివాలయంలో సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడారు.

గుమ్మఘట్ట: బాలల హక్కులు, చట్టాలను తెలుసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాలతో కలిగే దుష్ప్రభావాలు, రక్తహీనత అంశాలపై పీహెచ్‌సీ వైద్యులు రాంకిశోర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ, హెచ్‌ఎం యోగేంద్రనాథ్, హెల్త్ సూపర్‌వైజర్ ఆదిబయమ్మ అవగాహన కల్పించారు.

ఉరవకొండ రూరల్: ఆమిద్యాలలోని అంగన్‌వాడీ 4వ సెంటర్ పరిధిలో కిశోరి వికాసంపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉరవకొండ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాబియా, రాకెట్ల పీహెచ్‌సీ నాగరంగయ్య మాట్లాడుతూ మే 2 నుంచి జూన్ 10 వరకు కిశోరి వికాసంపై కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆమిద్యాల అంగన్‌వాడీ టీచర్ జాన్సీ, నాగవేణి, రంగమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.

భావనారుషీశ్వరుల జయంతి



భావనారుషి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రాయదుర్గంటౌన్: మార్కండేయస్వామి ఆలయంలో శుక్రవారం భావనారుషీశ్వరుల జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ,అర్చనలు చేశారు. భావనారుషి చిత్రపటాన్ని వీధుల్లో ఊరేగించారు. అనంతరం కల్యాణోత్సవం జరిగింది. పద్మశాలి బహుత్తమ సంక్షేమ సేవా సంఘం సభ్యులు, యూత్ కమిటీ, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 1వ సచివాలయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది మూవ్‌మెంట్ రిజిష్టర్, హాజరు పట్టికను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావాలన్నారు. అనంతరం అక్కడికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. 1వ వార్డు ఇన్‌చార్జ్ దివాకర్, కో ఆప్షన్ సభ్యుడు నజీర్ పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో బిల్లుల చెల్లింపు

కళ్యాణదుర్గం రూరల్: క్యూఆర్ కోడ్‌తోనే ఇక నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు. ఏపీఎస్‌పీడీసీఎల్ విద్యుత్ బిల్లులు చెల్లించడానికి మరింత సులభతరం చేసింది. ఇక నుంచి క్యూఆర్ కోడ్ సాయంతో వినియోగదారులు విద్యుత్ బిల్లులను ప్రతినెలా చెల్లించొచ్చని డిస్కం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గురురాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు విద్యుత్ బిల్లులను విద్యుత్ రెవెన్యూ కార్యాలయం లోగానీ యూపీఐ ద్వారాగానీ చెల్లించేవారు.

సచివాలయం తనిఖీ



బోరంపల్లిలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ నాగరాజ నాయుడు

కళ్యాణదుర్గం: బోరంపల్లి సచివాలయాన్ని డీపీఓ టి.నాగరాజ నాయుడు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనాన్ని పరిశీలించారు. భవనానికి కేటాయించిన నిధులు, పనుల వివరాలపై ఆరాతీశారు. అనంతరం పక్కనే ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులు, సచివాలయ ఉద్యోగుల వివరాలు, హాజరు, సేవలపై ఎంపీడీఓ రంగనాయకులును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. సచివాలయ కార్యదర్శి నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల తీరుపై అసహనం



మాట్లాడుతున్న ఎంపీపీ కరణం పుష్పావతి

విడపనకల్లు: అధికారుల తీరుపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీపీ కరణం పుష్పావతి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కూడా అధికారులు గ్రామాల్లో సర్పంచులకు, ఎంపీటీసీలకు కనీసం గౌరవం కూడా ఇవ్వడం లేదని, ప్రొటోకాల్ పాటించలేదని సభ్యులు ధ్వజమెత్తారు. గ్రామాల్లో నీటి సమస్య పరిష్కరించలేదని, విద్యుత్ స్తంభాలు నేల కొరిగినా పట్టించుకోలేదని సభ్యులు అన్నారు. ఎంపీడీఓ షకీలాబేగం, ఏఈ భాస్కర్, జెడ్పీటీసీ హనుమంతు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

విడపనకల్లు: వి.కొత్తకోటలో శుక్రవారం బీభత్సంగా గాలి వీయడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు విరిగి పోయాయి. వైర్లు కిందకుపడినా అధికారులు మరమ్మతులు చేయలేదని స్థానికులు తెలిపారు.

నాణ్యతగా చేస్తేనే కూలి

కూడేరు: నిబంధనల మేరకు పనులను నాణ్యతగా చేస్తేనే రూ.307 దినసరి కూలి వర్తిస్తుందని ఏపీఓ పోలేరయ్య అన్నారు. జల్లిపల్లిలో ఉపాధి పథకం ద్వారా ధర్మవరం కుడికాలువలో జరుగుతున్న కంపచెట్ల తొలగింపు, పూడిక తీత పనులను శుక్రవారం ఏపీఓ పోలేరయ్య తనిఖీ చేశారు.

ఉపాధి పనులు కల్పించండి

విడపనకల్లు: పాల్తూరులో ఉపాధి పనులు కల్పించాలని కూలీలు ఎంపీడీఓ షకీలాబేగంను శుక్రవారం కోరారు. ఉపాధి పనులు లేక చాలా మంది కూలీలు వలసబాట పడుతున్నారని ఎంపీడీఓకు పాల్తూరు గ్రామస్తులు తెలియజేశారు.